# నాన్నార్కి గుడ్‌బై

గంటి వెంకటరమణ

> కుమార్ కుప్పలా కూలిపోయాడు ఆయన పాదాలముందు . రెండు చేతుల్తో ఆయన్ని కదలనీయకుండా పట్టుకున్నాడు. అతని కన్నీరు ఆయన పాదాల్ని అభిషేకం చేస్తుంటే మేరువులాంటి ఆయన వ్యక్తిత్వం కరిగిపోతోంది. ... ...

అర్ధరాత్రి ఆపకుండా మ్రోగుతున్న టెలిఫోన్ అందుకుని జవాబుగా 'హలో' అన్నారు రెడ్డిగారు. అవతలినుంచి ఆయనకి చెప్పాల్సిన విషయాలు గబగబా చెప్పేశారు. ఆయన అన్నిటికీ 'ఎస్' 'అలాగే' అంటూ జవాబులు చెప్పారు.

పక్కనే పడుకున్న ఆయన భార్య కళ్ళు తెరిచి చూసింది. రెడ్డిగారు మంచం మీంచి లేచి గబగబా బాత్‌రూమ్ వైపు పరిగెత్తారు. పదినిముషాల్లో తయారై భార్య దగ్గరికి వచ్చారు. ఆవిడ సగం నిద్రకళ్ళతో లేచి 'టీ' తయారుచేసి తీసుకువచ్చి ఆయనకి ఇచ్చింది. అది రెండు గుక్కల్లో త్రాగేసి 'జాగ్రత్త పిల్లలకి నేను వారం రోజుల్లో వస్తానని చెప్పు' అనేసి కారు తాళాలు తీసుకున్నారు.

ఆయన మెట్లు దిగి క్రిందికి వెళ్ళి కారు తీసుకుని వెళ్ళిపోయేవరకూ కిటికీలోంచి చూసి, ఆ మసక చీకట్లలో చేయిఊపింది. కారు అటు వెళ్ళిపోగానే మంచం మీద వాలిపోయింది.

మర్నాడు సాయంత్రం ఆవిడ ఫోన్‌లో కొడుకుతో నెమ్మదిగా బ్రతిమాలుతున్న ధోరణిలో అంది! త్వరగా వచ్చేసేయ్ కుమార్. నీకోసం తమ్ముడు ఎదురుచూస్తున్నాడు!

అటునుంచి వచ్చిన జవాబుకి ఆవిడ దీర్ఘంగా నిట్టూర్చింది.

కుమార్ పక్కనే ఉన్న శ్యాం, రాజా, పవన్ 'ఏమైందిరా?' అని అడిగారు. కుమార్ చిన్నగా నవ్వాడు: 'ఏమీ కాలేదు'

'మరి పిక్చర్ ప్రోగ్రాం మాటేం చేశావ్?'

'నేను రెడీ'

కుమార్ జేబులో డబ్బు మంచినీళ్ళ ప్రాయంగా ఖర్చయిపోతోంది. ఇంజనీరింగ్ చదువుతున్న ఆ మిగిలిన ముగ్గురూ కుమార్ డబ్బుతో పండగ చేసుకుంటున్నారు . ఆ రూమ్ స్కాచ్ విస్కీ, సిగరెట్ కలిపిన వాసనతో మత్తు కలిగిస్తోంది.

కుమార్‌కి గుండెనిండా దిగులు. తనెందుకు ఈ 'సాలెగూడు' లోంచి తప్పించుకోలేకపోతున్నాడు? కుమార్ నువ్వురా స్నేహితుడివంటే... మా దగ్గర కార్లున్నాయి. ఏంలాభం మా నాన్నలు అడుగు ముందుకు వేయనీయరు.

'పురేయ్... డబ్బు మింగేస్తున్న వెధవలం అనుకోకురా... మేం బాగా సంపాదించి నీ రుణం తీర్చుకుంటాం . ఈ స్కాచ్‌లో ఎన్ని చుక్కలున్నాయో అన్ని కరెన్సీ నోట్లు ఇచ్చేస్తాం...

'కొద్దిగా... కొద్దిగా ఓపిక పట్టు మేం పరీక్ష పాసైన వెంటనే జాబ్స్ వస్తాయి. అప్పుడు... అప్పుడు నీకు పట్టంకడతాం...' ముద్దముద్దగా మాట్లాడుతున్నారు. వాళ్ళు మాట్లాడే మాటలు కుమార్‌కి ఒక్కడికే అర్థమవుతున్నాయి. అతను భయపడుతున్నాడు.

తండ్రి గడపదాటితే పది వేలు అనుకుంటాడు. ఆయన నెలలో ఏ నాలుగైదు రోజులో ఇంటి పట్టున ఉంటాడు. చిన్నప్పటినుంచీ అంతే. ఒక్కసారి కూడా తమని దగ్గరికి తీసుకుని ఎరుగడు. తండ్రి ప్రేమ ఎలా ఉంటుందో అసలు తెలీదు.

ఆయన 'హలో' అంటాడు అదీ ఎప్పుడో. ఇంట్లో ఉన్నా ఊపిరి సలపనీయకుండా ఆయనకోసం వచ్చే వ్యక్తుల్తో నిండిపోయి ఉంటుంది. ఆయన చిన్నతనం కష్టాల సుడిగుండాల్లో చిక్కుకుని ఆర్థిక సమస్యల్తో ముంచెత్తి ఆయన్ని జీవితానికి ఎదురీదేటట్లు చేసింది. ఆయన నరసరంలో కసి. స్వయంకృషితో పెరిగి పెద్దవాడయాడు.

ఏ డబ్బు చిక్కుల్లో తను కష్టాల్ని అనుభవించాడో అటువంటి దుస్థశ తన బిడ్డలకి చేరువకాకూడదని కంకణం కట్టుకున్నాడు. పిల్లల్ని మంచి స్కూళ్ళల్లో చేర్పించాడు. అంతవరకూ కుమార్ తండ్రిని గురించి అర్థం చేసుకోగలడు. కానీ ఆ తరువాతే కుమార్ అర్థం చేసుకోలేకపోయాడు.

కాదు రెడ్డిగారే పిల్లల్ని అర్థం చేసుకోలేదేమో?

'నేను ఇంటికి వెళ్ళాలి. నాకోసం తమ్ముడు ఎదురుచూస్తున్నాడని అమ్మ చెప్పింది.'

'వారా కుమార్! మీ తమ్ముడు కూడా వీలాగ ఫ్రెండ్స్ సర్కిల్లో ఉండి ఉంటాడు. మధ్యలో వెళ్ళిపోతే ఎలాగరా?'

'స్టాపిట్' కుమార్ కోపంతో లేచి నిల్చున్నాడు. అతనికి తమ్ముడి గురించి తెలుసు. తమ్ముడు అటువంటివాడు కాదు. కావాలనే వీళ్ళు అంటున్నారు. తన డబ్బుతో పబ్బం గడుపుకుంటూ తన తమ్ముడిని అంటే తను అసలు సహించలేడు.

తెల్లబోయారు శ్యాం, పవన్, రాజా! 'సారీ కుమార్. ఈ రౌండు అయ్యేవరకు నువ్వు ఇక్కడే ఆగిపోవాలని అలా అన్నాం. ప్లీజ్ నువ్వు వెళ్లకు!

కుమార్ జేబులోంచి డబ్బుతీసి వాళ్లకి ఇచ్చేసి గడపదాటాడు. వాళ్ళు ఇతనికోసం బయటికి రాలేదు.

కుమార్ స్కూటర్ తీసుకుని ఇంటికి వచ్చాడు... తల్లి పక్కింటి ఆవిడతో మాట్లాడుతోంది. అతను లోపలికి వెళ్ళాడు. ఇల్లంతా కలియ తిరిగాడు. తమ్ముడు కనిపించలేదు. అతనికి గుండె ఝల్లుమంది.

తను... తను తప్పు చేస్తున్నాడా? ఒకసారి చేసిన చిన్న పొరపాటుకి తను ఇలా చిక్కుకుపోయాడు. తన మాదిరి తమ్ముడు అలా అయేందుకు వీల్లేదు. 'అమ్మా' దిక్కులు పిక్కటిల్లేలా వేసిన కేకకి ఆ తల్లి కడుపులో పేగులు అదిరిపోయాయి.

కుమార్ మాట్లాడితే పక్కనున్నవాళ్లకి వినిపించదు . అటువంటిది గొంతు పెగల్చుకుని పెట్టిన ఆ కేకకి ఆవిడ పరిగెత్తి వచ్చినట్లు లోపలికి వచ్చి 'ఏమైందిరా' అని అడిగింది.

'తమ్ముడేడమ్మా'

'ఇందుకా? కొంపలేవో అంటుకుపోయాయనుకున్నాను. వస్తాడు లే' అనేసి అక్కణ్ణించి కదిలి వెళ్ళిపోయిందావిడ. కుమార్ మొహం కడుక్కుని తన గదిలోకి వెళ్ళిపోయాడు.

తండ్రి సంపాదించిన డబ్బుతో మరో నాలుగు తరాలు హాయిగా కాలుమీద కాలు వేసుకుని తినవచ్చును. తను... తనేం చేస్తున్నాడు? తన ప్రయాణం ఎటువైపు సాగిపోతోంది. తనతోబాటు స్కూల్ ఫైనల్ పాసైన ఆ మిగిలిన ముగ్గురూ ఇప్పుడు ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్‌లో ఉన్నారు. రేపు పరీక్షలైపోతే గొప్ప హోదాతో సొసైటీలో చొచ్చుకుపోతారు. మరి తను?

తను చదవలేకపోతున్నాడెందుకని?

ఎప్పుడూ లేని ఆలోచనల్తో కుమార్ బుర్ర వేడెక్కిపోతోంది. అతని పిడికిళ్ళు బిగుసుకుంటున్నాయి

లక్షల రూపాయల్తో సీటు కొనుక్కునే తాహతు తనకుంది. కానీ... ముందు ఈ ఇంటర్ పరీక్షే పాస్‌కాలేదు. అది గట్టెక్కితేనే కదా...

మర్నాడు ట్యూషన్ మాస్టర్ కుమార్‌ని అడిగారు! చాలా రోజుల్నుంచి నీకు ఫిజిక్స్ చెబుతున్నాను. ఇప్పటివరకూ నువ్వు 'పే' చేసిన ఫీజు అందరికంటే ఎక్కువే. కుమార్ నిన్నో మాట అడుగుతాను. నువ్వు మొహమాటం లేకుండా చెబుతావా?'

'ఎస్. సర్' కుమార్ వినయంగా అన్నాడు.

'నీ దగ్గర డబ్బు తీసుకోవడం నిన్ను లూటీ చేస్తున్నంత పాపంలా కనిపిస్తోంది నాకు. నీతిపరుడైన ఏ ఉపాధ్యాయుడూ డబ్బు దోచుకునే ధోరణిలో



ఉండకూడదు. ఇంతకీ నీకు చదువుకోవాలని వుందా, లేదా?'

'ఉన్నది సర్.'

'నే చెప్పేది నీకు అర్థం కావడం లేదా?'

'అదేం లేదు సర్'

'మరి... మరి నువ్వెందుకు చదువుకుందుకు వస్తున్నట్లు?'

బుర్ర వొంచుకున్నాడు కుమార్.

'మన స్వంత ఆర్జితం అయితే తెలుస్తుంది. తమ పిల్లలు అభివృద్ధిలోకి రావాలని రాత్రీ పగలూ భేదం తెలియకుండా కష్టపడి సంపాదించిన డబ్బు పిల్లల చదువుకోసమని తాపత్రయ పడుతుంటే... ఇదిగో నీలాంటి బాధ్యత తెలియని పిల్లలే ఇలా తగలేస్తున్నారు... డబ్బంటే ఎవరికీ చేదుకాదు కుమార్. బట్... నీద్వారా వచ్చే డబ్బు నాకు అక్కర్లేదు...

'నీకో సంగతి చెబుతా విను. నీ బుర్రలో తెలివితేటలు శూన్యం. నువ్వేదో తలకెత్తిపోస్తావనే భ్రమపడుతున్నట్లున్నారు నీ తల్లితండ్రులు. నీ మీద పెట్టే ప్రతి పైసా మట్టిపాలు చేసినట్టే. నీకసలు చదువురాదు. ఐ ఛాలెంజ్ యూ... నీకోసం ఖర్చుచేసే ప్రతి క్షణం నాకు వృధా. ఈసరికి చుట్టూ ఉన్న గోడలకి చదువు వచ్చి ఉండేది. నేను వాటివైపు చూసి చెప్పివుంటే.

'సర్' కుమార్‌కి తలతీసేసినట్లయింది.

'అఫ్‌కోర్స్ నిన్ననే అధికారం నాకు లేదు. నేను వృత్తి రీత్యా ఉపాధ్యాయుడిని. నా దృష్టిలో స్టూడెంట్స్ ఎవరైనా నా కడుపున పుట్టిన వాళ్ళ మాదిరే కన్పిస్తారు. నా బిడ్డనైనా ఇదే రకంగా సత్కరించి వుండేవాడిని... కాదు. తన్ని తగలేసేవాడిని. డబ్బుతో హోదా రాదు. చదువుతో స్మార్టువి కాగలరు...

నువ్వింక వెళ్ళవచ్చు.

కుమార్ కుప్పలా కూలిపోయాడు ఆయన పాదాల ముందు.

రెండు చేతుల్తో ఆయన్ని కదలనీయకుండా పట్టుకున్నాడు. అతని కన్నీరు ఆయన పాదాల్ని అభిషేకం చేస్తుంటే మేరువులాంటి ఆయన వ్యక్తిత్వం ఆ కుర్రాడి, ఆవేదనకి కరిగిపోతోంది. ఆ ప్రవాహంలో కొట్టుకుపోతున్నట్లు భావన కలుగుతోంది. అప్పటికే ఆయన కౌగిలిలో ఉన్నాడు వాడు.

ఎమ్.ఎస్.సి చేసి ఆపైన ఫిజిక్స్‌లో రకరకాల ప్రయోగాల్తో డాక్టరేట్ సంపాదించిన ప్రొఫెసర్ మూర్తిగారు సైకాలజీ కూడా ఆపోశనపట్టారు. పిల్లల డ్రాపౌట్స్‌కి కారణం ఫామిలీ బాక్‌గ్రౌండ్ ముఖ్యం అని ఆ జీనియస్‌కి తెలుసు. వీలు చూసుకుని ఎప్పుడు ఎలా అస్త్రాన్ని ప్రయోగించాలో సరిగా అదే సమయంలో ఆయన ఉపయోగించారు.

కుమార్ ఒక్కో విషయమే చెబుతుంటే ఆయన విన్నాడు. పూర్తిగా విని అతని బుగ్గల మీద కన్నీరు చేత్తో తుడిచి చెప్పారు.

కుమార్ ఆయన ఎదమీద వాలిపోయి ఆయన చెప్పిన మాటల్ని జాగ్రత్తగా విన్నాడు. చివరికి తన నిర్ణయాన్ని తెలియజేశాడు. ముందు బాధపడినా ప్రొఫెసర్ ఆ పిల్లవాడి సంఘర్షణని అర్థం చేసుకుని 'సరే' అనక తప్పలేదు.

రెండురోజులు, మూడు రోజులు, వరుసగా పది

రోజులు కనిపించకపోయేసరికి రెడ్డిగారికి ట్రంకాల్ చేసి విషయం చెప్పింది ఆయన ఇల్లాలు.

ఎక్కడ పని అక్కడే వదిలేసి ఆయన హుటాహుటిన ఆవిడముందు వాలారు. ఆవిడ ఈ పది రోజుల్నుంచి నిద్రాహారాలు మానేసింది. ఏడ్చి ఏడ్చి కళ్ళు ఉబ్బిపోయాయి. మంచంమీద శవాకారంలా పడివున్న ఆవిడని చూడగానే ఆయనకూడా తన గడియారాన్ని ఐదు నిముషాలు ఆపేశారు. (ఆయన తన కోసం ఎప్పుడూ సమయాన్ని కేటాయించి ఎరుగడు కనుక).

మంచం మీద కూర్చుని ఏం జరిగింది? అని అడిగారు.

ఆవిడ ఆరోజు పోస్ట్‌లో వచ్చిన ఉత్తరాన్ని ఆయన చేతికి అందించి తలగడలో తలదూర్చి భోరుమంది .

నాన్నారూ.

నమస్కారం అండీ. నేను కనిపించకపోయేసరికి అమ్మ రెండు మూడు రోజులు అలవాటుగా తీసుకుంటుంది. ఎందుకంటే అప్పుడప్పుడు నేను వారం రోజులైనా ఇంటి మొహం చూడను కనుక. నా విషయం మీకు ఇప్పటివరకు ఆవిడ మీతో చెప్పలేదు. కన్నప్రేమ ఆమెనలా కట్టి పడేసిందేమో మరి? అమ్మ చెప్పకపోవడంతో నేను మీరటువెళ్ళగానే ఇటు నా స్వంత పనుల్లో బిగుసుకుపోయేవాడిని. నాకున్న రాచకార్యాలు మీకిన్నాళ్ళూ తెలియవు. మీరు గొప్ప బిజినెస్ మాగ్నెట్.

నేను నా చుట్టూ ఉన్న స్నేహితుల భట్రాజు పొగడ్తలతో తడిసి వాళ్ళ గొంతులు తడిపి యథేచ్ఛగా వ్యసనాల మధ్య సౌఖ్యాన్ని మీ డబ్బుతో కొనుక్కుంటూ తీరిక లేని మహామనీషిని (ఇది నా ఫ్రెండ్స్ నా కిచ్చిన కితాబు).

నా స్నేహితులందరూ స్టేటస్‌లో నాకంటే గొప్పవాళ్ళే. అడిగినప్పుడల్లా డబ్బు ఇచ్చి బయటికి పంపే తల్లిదండ్రులు మాత్రం వాళ్ళకి లేరు.

వాళ్ళు బాగా చదువుకున్నారు. ఎందుకో తెలుసాండీ? ఎప్పటికప్పుడు స్కూలుకి వచ్చి తమ పిల్లలెలా చదువుతున్నారో తెలుసుకునే తండ్రి చాటు పిల్లలు వాళ్ళంతా. డైనింగ్ టేబిల్ దగ్గర అందరూ కలిసి భోజనం చేయాలి. పిక్‌నిక్‌లకీ, పార్టీలకీ పిల్లలతోనే కలిసి వెళ్ళాలి... పిల్లలే వాళ్ల జీవితాలు, సంపాదించడం... ఇట్స్ ఎ పార్టాఫ్ లైఫ్.

కానీ మీరు? ఎప్పుడైనా నా చిటికెన వేలు పట్టుకుని నన్ను స్కూల్లో డ్రాప్ చేశారా నాన్నారూ? ఎప్పుడైనా మీ ఫోమ్ పరుపుమీద నా పక్కన పడుకుని నా డ్రాపులోకి వేళ్ళు పోనిచ్చి మీ గుండెలకి హత్తుకున్నారా? నో... మీరలా చేయలేదు. మీరు వస్తుంటే 'పులి' వస్తున్నట్లు భ్రాంతి. మీరు ఇల్లంతా తిరుగుతుంటే 'బెంగాల్ టైగర్' కదులుతున్న భ్రమ. మీ ఉచ్ఛ్వాసనిశ్వాసాలు పడుకున్న సింహాన్ని గుర్తుకు తెచ్చేవి.

మీకూ మాకూ మధ్య ఎంత దూరమో నా ఒక్కడికే తెలుసు. రెండు చేతులూ చాపి 'మైసన్' అని మీరు దగ్గరికి తీసుకుని ఉంటే నా రిజల్టు కోసం నేను ప్రాకులాడేవాడిని. కేవలం డబ్బుతో చదువు కొనుక్కోవచ్చుననుకుని మీరు డబ్బు విరజిమ్మారు. అది నాకేం మిగిల్చిందో తెలుసాండీ....

నా బుర్రలో ఉన్నదంతా మట్టే. నేను ఇంజనీర్ని కావాలని అమ్మ కోరిక. మీ పలుకుబడితో, డబ్బుతో నేను ఇంజనీర్‌ని అయివుంటే వేలాదిమంది ప్రాణాలతో చెలగాటం ఆడి ఇంజనీర్ని అయేవాడిని.

పునాదిలేని ఈ చదువు నాకొద్దు. అసలు నా జీవితం అసలైన పునాది లేక విపరీతంగా బీటలుతీసింది. దీన్ని సరిచేయడం మీవల్ల కాదు. నాకీ జీవితం మీద విసుగు ఏర్పడింది.


ఆకలి తీర్చేందుకు అన్నం కావాలే గానీ ఆల్టర్నేటివ్‌గా మరేదో తిని సర్దుకుంటే సరిపోదు. తల్లిదండ్రులు పిల్లలకి సరైన ప్రేమార్తిని తీర్చాలి. ఇంత భాషా పరిజ్ఞానం నాకు విరక్తిలో కలుగుతున్నదే తప్ప నా గొప్పకాదు.

నాకోసం మీరు ప్రకటనలు చేయించీ, టీవీల్లో చూపించీ ఇంకా ఇంకా ఖర్చు చేయకండి. చిన్నవాడినైనా చేరదీసి మీ తప్పు సవరించుకోండి.

నేనుమాత్రం శాశ్వతంగా సెలవు తీసుకుంటాననుకోవద్దు. మీకూ నాకూ మధ్య మమతానురాగాలు లేవు కనుక నాకోసం బాధపడుతున్నారన్న ప్రసక్తే రాదు. నేను నేనుగా బ్రతక దల్చుకున్నాను.

''నాన్నారూ గుడ్‌బై''

ఆరడుగుల రెడ్డిగారు నిలువునా కూలిపోయారు.



### వచ్చింది

గేట్ తోసుకుని వస్తున్న ఆవుని
చూసి అమ్మతో చెప్పాడు చింటూ
''అమ్మా. ఆవొచ్చిందే''
''వాస్తే వచ్చింది. ఆ తర్వాత
'ఇ'రాయి'' కేకలేసింది తల్లి.

—ఎస్.కె.నాగలక్ష్మి (హిందూపురం

ఆయన చెవుల ముందు డబ్బు గలగలలు వినిపించడం లేదు. కారుచీకట్లలో తప్పిపోయిన పసివాడి ఆర్తనాదం వినిపిస్తోంది. ముచ్చెమటలతో ఆయన బట్టలు అప్పటికప్పుడు తడిసి ముద్దైపోయాయి.

తనను తాను పరికించి చూసుకున్నారు. ఆపైన ఉండబట్టలేక బావురుమన్నారు. ఇంతకాలం ఆయన కప్పుకున్న గాంభీర్యపు వలువ నెమ్మదిగా జారిపోయింది.

'బాబూ కుమార్' అని రెండు చేతుల మధ్యా తల దాచుకున్నారు. అక్కడి గాలి స్తంభించినట్లయింది. ఆయన పక్కనే ఉన్న భార్యా, అటువైపు ఉన్న చిన్న కొడుకూ ఈ నిజాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు... ఆయన... ఆయనకూడా ఏడుస్తాడా? నమ్మలేనట్లు చూస్తున్నారు... ఆయన అంతరంగం కదిలి కదిలి ఏడుస్తోంది... ఆయన మామూలు మనిషైపోయాడు. చుట్టూ వెర్రివాడిలా చూస్తున్నారు... పెద్ద కొడుకు తప్ప అన్నీ ఉన్నాయి ఆయనకి...

ఇది జరిగిన పదేళ్ళకి టీవీలో సైంటిస్టుల సమావేశంలో ముందు వరుసలో కూర్చుని చర్చిస్తున్న కుమార్ ప్రసంగం... రిలే అయింది... కానీ అప్పుడాయన మాత్రం లేరు. ప్రొఫెసర్ మూర్తిగారు మాత్రం అభినందిస్తూ 'టెలిగ్రాం' పంపారు.

*



## బిజినెస్

హిందీలో ఇప్పుడు గాయనిగా అనురాధా పొడ్వాల్ యమ బిజీ అయిపోయింది.

టీ-సీరీస్ కాసెట్స్ అధినేత గుల్షన్ కుమార్— అనురాధను ఎంకరేజ్ చేయడంలో ఆంతర్యం గురించి రకరకాలుగా చెప్పుకుంటున్నారు.

దీనికి అనురాధ—

''మా ఇద్దరిమధ్యా ఎఫయిర్‌లు గిఫయిర్‌లు లాంటివేమీ లేవు. కేవలం మామధ్య వున్నది 'బిజినెస్' మాత్రమే. నా టాలెంట్‌ని గుర్తించి ఆయన ప్రోత్సహించడంలో తప్పేంటి? దీనికి పెడర్థాలు తీయడం అస్సలు బాలేదు'' అంటోంది!

—బి.పద్మజ

